

# చిలక జోస్యం

-వాణిశ్రీ

**సత్యమూర్తి జైలు నుంచి విడుదలయ్యాడు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా మంచి ప్రవర్తన కలిగి, జైల్లో వివాదాలకు అతీతంగా మెలిగిన కొందర్ని శిక్షాకాలం పూర్తి కాకుండా విడుదల చేసారు. ఆ ఉదయం విడుదలైన ఖైదీల కోసం వారి వారి బంధువులు, స్నేహితులతో సెంట్రల్ జైలు ముందు ఆవరణంతా కోలాహలంగా ఉంది. గేటు దాటి బైటకు వచ్చిన వారికి మిఠాయిలు తినిపిస్తూ ఆనందం వ్యక్తం చేస్తున్నవారు కొందరైతే, రాజకీయ నేపథ్యంగల కొందరికి ఘనంగా స్వాగతం పలుకుతున్నారు అనుచరులు.**

పూల దండలు వేసి, బొకేలు అందించి, ఒకరిమీద మరొకరు రంగులు జల్లుకుంటూ డప్పులు మోగించుకుంటూ హంగామా చేస్తున్నారు.

సత్యమూర్తి అదంతా చూసి నవ్వుకుంటూ ముందుకు సాగిపోయాడు. అతని భుజానికి సంచీ మాత్రం వేలాడుతోంది. తనకోసం ఎవరూ రారని అతనికి తెలుసు. తను జైలుకు వెళ్లడంతో పరువు ప్రతిష్ట కోల్పోయామని భావించిన కుటుంబం అతన్ని వెలివేసింది. తల్లి బ్రతకుంటే తన విడుదల తెలిసి వచ్చి ఉండేదేమో? తండ్రి ఉన్నా అన్నావదినెల చేతిలో బందీ. ఇక తనకు ఎవరూలేరు. స్నేహితులు కూడా తనను ఆదరించరు. తన జేబులోవున్న డబ్బు ఖర్చయిపోయేలోపల ఏదైనా ఉపాధి సంపాదించుకోవాలి. అది కూడా దూరంగా బొంబాయి, ఢిల్లీ, కలకత్తా వంటి ఏదో ఒక నగరం వెళ్లాలి. ఎలాగో బ్రతకొచ్చు.

సత్యమూర్తికి మధ్యలో బార్బర్ షాపు కనిపించింది. గడ్డం తడుముకున్నాడు. పెరిగి ఉంది. షాపులోకి వెళ్లి క్రాఫ్ చేయించుకుని గడ్డం గీయించుకున్నాడు. సులభ్ కాంప్లెక్స్‌లో స్నానం చేసి రైల్వేస్టేషన్‌కు వెళ్లాలనుకుంటూ నడుస్తున్నాడు.

అతని దృష్టి రోడ్డు పక్కన చెట్టు కింద కూర్చున్న ఒక ముసలాయన మీద పడింది. అతనికి ఎన్నేళ్లుంటాయో? సన్నగా, అస్థిపంజరంలా ఉన్నాడు. ముఖంలో ఎన్ని ముడతలున్నాయో? ముఖాన రూపాయి బిళ్లంత కుంకుమబొట్టు పెట్టుకున్నాడు. అతని పక్కనే చిలకలున్న చెక్క పెట్టె ఉంది.

దారినపోయేవాళ్లవైపు ఆశగా చూస్తున్నాడు ఎవరైనా చిలకజోస్యం చెప్పించుకుంటారేమోనని. పావం అతని జీవితమంతా నిరీక్షణలోనే గడిచిపోతుందేమో అనుకుని జాలిపడ్డాడు. లోకంలో బతకడానికి ఎన్నో వృత్తులుండగా ఈ చిలకజోస్యం చెప్పుకుంటూ ఎందుకు జీవిస్తున్నాడు? ఇంకేం దొరకలేదా? దీనిమీద వచ్చే ఆదాయంతో రోజులు గడుస్తాయా? బహుశా ఇతనికి అతని తండ్రి నుంచి ఈ వృత్తి వారసత్వంగా వచ్చిందేమో? అనుకున్నాడు.

ఆమధ్య జైల్లో ఒక స్వామి ప్రవచనాలు చెప్పాడు. అందులో ఇతరులకు సహాయం చేసినప్పుడే మనిషికి నిజమైన తృప్తి కలుగుతుందనీ, సహాయం పొందిన వ్యక్తి నిజమైన ఆనందం పొందుతాడనీ చెప్పాడు. ఇతరులకోసం జీవించడమే తనకు ఇష్టమనీ, అటువంటివాడే తన భక్తుడనీ దేవుడు చెప్పాడని స్వామి ప్రవచనం సత్యమూర్తికి గుర్తొచ్చాయి.

తను ఇప్పుడు ఎవరికోసం జీవించాలి? తనకు నా అనేవాళ్లు ఎవ్వరూలేరు. తన జీవితం ఇతరులకు సహాయం చేయడానికి అంకితం చేస్తే? అతనికి ఆ ఆలోచన తృప్తిగా ఉంది. ముందుగా ఈ ముసలాయన్ని సంతోషపెట్టాలి. చిలక జోస్యం చెప్పించుకున్నందుకు ఎవరైనా ఐదో పదో ఇస్తారమో? తను వంద రూపాయలిస్తాడు. ఆ ముసలాయన సంతోషపడతాడు అనుకున్నాడు. —

సత్యమూర్తి వెళ్లి అతనికి ఎదురుగా కూర్చున్నాడు. ముసలాయన ముఖంలో ఆనందం కనిపించింది.

"ఎంత?'' అని అడిగాడు సత్యమూర్తి.

"నీ ఇష్టమొచ్చినంత ఇవ్వు నాయనా'' అంటూ కొన్ని కార్డులు వరుసగా నేలమీద పరచి రామచిలుకను వాటి మీదకు వదిలాడు. అది ఒక కార్డు ముక్కుతో కరచి పట్టుకుని అతనికి అందించింది. కిచకిచలాడుతూ రెక్కలార్చి కొట్టుకుని మళ్లీ ఆ పెట్టెలోకి వెళ్లింది.

ముసలాయన కళ్లు చిట్లించి ఆ కార్డులోని చిలక జోస్యం చెప్పసాగాడు.

"నాయనా! నీ జాతకం అమోఘం. నిన్ను కోరుకున్న అమ్మాయితో వివాహం జరుగుతుంది. నలుగురు పిల్లలు రత్నాలవంటి వాళ్లు పుడతారు. రాజభవనం లాంటి ఇల్లు కడతావు. విమానాల్లో తిరుగుతావు''

సత్యమూర్తి లేచి నుంచుని పకపకా నవ్వాడు. జేబులోంచి వంద రూపాయల కాగితం తీసి అతనికిచ్చాడు.

ఆ ముసలాయన సంభ్రమాశ్చర్యాలతో సత్యమూర్తి వంకా, అతనిచ్చిన వంద రూపాయల వంకా మార్చి మార్చి చూసాడు.

సత్యమూర్తి తనలో తను నవ్వుకుంటూ రోడ్డుమీద నడుస్తుండగా ఆమె ఎదురుపడింది.

"సత్యమూర్తిగారూ!'' అని పిలిచింది.

సత్యమూర్తి ఠక్కున ఆగిపోయాడు. ఆమెవైపు తలెత్తి చూసాడు. ఆమె ఎవరో వెంటనే గుర్తుకురాలేదు. ఎవరు ఈమె? ఎక్కడో చూసినట్లుంది. తనను పేరు పెట్టి పిలిచిందంటే తనెవరో ఆమెకు బాగా తెలిసుండాలి. అతను ఆమెను ఎగాదిగా చూస్తూ నిల్చుండిపోయాడు.

"మీరు ఈరోజు విడుదల అవుతున్నారని తెలిసి వస్తున్నాను'' అన్నాదామె.

ఆమె ముఖంలో ఎంత ఆనందం వ్యక్తమవు

తోంది. తను విడుదల అవుతున్నట్లు తెలుసుకుని వచ్చిందా? ఎందుకు? ఎవరు ఈమె? తనకు ఏమవుతుంది?

"మీరూ?" అన్నాడు ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ.

"నన్ను మర్చిపోయారా? భలేవారే. ఈరోజు మిమ్మల్ని కలుస్తానో లేదోనని కంగారు పడ్డాను. జైలువాళ్లకి ఫోన్ చేస్తే మార్నింగ్ టెన్‌కి డిశ్చార్జ్ మొదలవుతుందన్నారు. మొత్తానికి దొరికారు. ఐదు నిముషాలు లేటుగా వచ్చుంటే మిమ్మల్ని మిస్సయ్యేదాన్ని. థాంక్‌గాడ్" అన్నదామె నవ్వుతూ.

"సారీ మేడమ్! మీరు ఎవరో నాకు తెలియడంలేదు" అన్నాడు సత్యమూర్తి.

ఆమె విభ్రాంతికి గురైంది. కొన్ని క్షణాలు అతని ముఖంలోకి అలా చూస్తూ ఉండిపోయింది.

"నేను గుర్తు పట్టలేనంతగా మారిపోయానా? నేనేనండీ పద్మావతిని. నా మూలంగానే కదా మీకు జైలు శిక్ష పడింది" అన్నదామె తేరుకుని.

"ఓ మీరా... చాలాకాలమైంది.." గొణిగినట్టుగా అన్నాడు.

"ఔను... పదేళ్లయింది. ఇంకా నాలుగేళ్లకి కానీ మీరు జైలు నుంచి విడుదల కారనుకున్నాను. థాంక్‌గాడ్. ముందుగానే బైటపడ్డారు. ఈ విషయం తెలిసి మా ఇంట్లోకూడా అంతా సంతోషించారు" ఆమె ముఖంలో ఆనందం తాండవిస్తోంది.


"నేనెప్పుడు రిలీజైనా ఒక్కటే. ముందుగా వచ్చి చేసేదేముంది. నాకు అక్కడ బాగానే వుంది. దేనికీ వెతుక్కోనక్కర్లేదు. అన్నీ సమయానికి సమకూరేవి. అస్సలు నా ప్రాబ్లమ్ ఇప్పుడే మొదలైంది. ఎలా బతకాలి? జైలునుంచి వచ్చినవాడివి అంటూ అంతా అంటరానివాడిగా చూస్తారు" పేలవంగా నవ్వాడు.

"అలా ఎందుకనుకుంటున్నారు? అందులో మీ తప్పేంలేదు" అన్నదామె.

"జైలుకెళ్లాడంటే అర్థమేమిటి?"

"కోర్టులో అంతా న్యాయమే జరుగుతుందా? కోర్టుకి చెవులే తప్ప కళ్లుండవు.మంచివాళ్లకి కూడా శిక్షలు పడడం నేరస్థులు తప్పించుకోడవం సర్వ సామాన్యమే" ఆవేశంలో అన్నది.

"మనం ఇలా రోడ్డుమీదే నిలబడి మాట్లాడుకోడం బాగుండదు. నన్ను చూడ్డానికి వచ్చినందుకు థాంక్స్. నేనిక బయల్దేరుతాను" అన్నాడు టైమ్ చూస్తూ.



"ఎక్కడికి వెళ్తున్నారు? మీవాళ్లెవ్వరూ లేరిక్కడ. మీ అన్నయ్య విశాఖ పట్నం ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. మీ నాన్న కూడా వాళ్లతోపాటే వెళ్లిపోయారు" చెప్పింది పద్మావతి.

"అలాగా" నిర్లిప్తంగా అన్నాడు.

"మరి ఎక్కడికెళ్తారు?" అడిగిందామె.

"ఏమో తెలీదు" ఆకాశం వైపు చూస్తూ అన్నాడు సత్యమూర్తి.

"మీరు ఎక్కడికీ వెళ్లవద్దు. నేను మిమ్మల్ని తీసుకెళ్లడానికే వచ్చాను" అంటూ అతని చేతిని గట్టిగా పట్టుకుంది పద్మావతి.

"ఎక్కడికి తీసుకెళ్తారు?" ఆశ్చర్యంతో ఆమె ముఖంలోకి చూస్తూ ప్రశ్నించాడు.

"మా ఇంటికే" అన్నదామె స్థిరచిత్తంతో.

"వద్దు బాగుండదు" మొహమాట పడుతూ అన్నాడు.

"ఇందులో బాగుండనిది ఏమీలేదు. మీరు నా గురించి జైలుకు వెళ్లారు. నా మూలాన మీరు కుటుంబానికి దూరమయ్యారు. మీ జీవితం నాశనమైంది" అంటూ ఆమె దుఃఖించడం మొదలుపెట్టింది.

"అరెరె... ఏమిటిది? ఎందుకంత ఎమోషన్? నేను అలా భావించడం లేదు. అంతా దైవనిర్ణయం. అలా యాదృచ్ఛికంగా జరిగింది. దానిలో మీ బాధ్యత ఏమీలేదు. మీరేం ఫీల్ కాకండి. ప్లీజ్ ఏడవకండి. అంతా మనల్నే చూస్తున్నారు" అన్నాడు చుట్టూ పరికిస్తూ.

"చూస్తే చూడనివ్వండి. నేను మిమ్మల్ని ఎక్కడికీ పోనివ్వను. ఇన్నేళ్లుగా మీ కోసం ఎదురు చూస్తూ కాలం గడుపుతున్నాను. ఎంత కాలమైనా సరే మిమ్మల్ని కలుసుకోవడమే నా జీవిత ధ్యేయం అని నిశ్చయించుకున్నాను" అన్నదామె కళ్లు తడుచుకుంటూ.

"అదేమిటి? నన్ను మీ ఇంటికి తీసుకువెళ్తే ఏం బావుంటుంది? మీ భర్త...?"

పద్మావతి అతన్ని మాట్లాడనివ్వకుండా "నేను పెళ్లి చేసుకోలేదు. మీకోసం నిరీక్షిస్తున్నాను. మీరే నాకు భర్తా, తోడూ నీడా" అన్నది ఆవేశపడుతూ.

సత్యమూర్తి షాక్ తిన్నట్లయిపోయి నోట మాట రాకుండా అలా నిలబడిపోయాడు.

పద్మావతి అటుపోతున్న ఆటోను ఆపి అతని చేతిని పట్టుకుని లాక్కెళ్లి అందులో కూర్చోబెట్టింది. అతడు ఇదంతా కలా? నిజమా అన్నట్లు సంభ్రమాశ్చర్యాలతో ఆమెవైపే చూస్తున్నాడు.

★★★

సత్యమూర్తిని పద్మావతి వాళ్లింట్లో అంతా బాగా ఆదరించారు. మర్యాదగా చూసారు.

ఒక ఖైదీ అని చిన్న చూపు చూడనందుకు ఆనందించాడు. పదేళ్ల తరువాత పంచభక్ష్య పరమాన్నాలతో ఇంటి భోజనం తిన్నాడు. పద్మావతి అతన్ని మేడమీది గదిలోకి తీసుకువెళ్లింది. అక్కడే అతనికి బస ఏర్పాటు చేసింది.

"మీరు విశ్రాంతి తీసుకోండి. రేపు మాట్లాడుకుందాం" అంది.

"నాకు నిద్రెలా పడుతుంది? ఇప్పుడు నువ్వేం చేస్తున్నావు? చదువు పూర్తి చేసావా?" అడిగాడు సత్యమూర్తి.


"మీరు జైలుకెళ్లాక నేను డిస్టర్బ్ అయ్యాను. అయ్యో నాకోసం అభం శుభం తెలియని మనిషి జైలుకెళ్లాడుగదా అనే విషయమే నన్ను ముల్లులా తొలుస్తుండేది. ఇక ఆ సంవత్సరం కాలేజీకి వెళ్లలేకపోయాను. కానీ స్నేహితులు, బంధువులు ధైర్యం చెప్పారు. గతాన్ని తలచుకుని బాధపడుతూ కూర్చుంటే ఏం ప్రయోజనం? భవిష్యత్తు గురించి ఆలోచించు అంటూ హితబోధ చేసారు. నిజమే అనిపించింది. ధైర్యం కూడగట్టుకుని మరుసటి ఏడు నుంచి కాలేజీకి వెళ్లాను.అప్పుడే నిర్ణయించుకున్నాను. నా కోసం జైలుకెళ్లిన మీకు నేను కృతజ్ఞత ఎలా చూపను? కేవలం థాంక్స్ అని ఒక్క చెప్పి నమస్కారం చేస్తే మీ జీవితం బాగు పడుతుందా? అందుకని మీరు జైలు నుంచి వచ్చేవరకు నిరీక్షించాలని, జీవితాంతం మీకు తోడుగా ఉండాలని నిర్ణయించుకున్నాను. మీరు నన్ను పిచ్చిదాన్నని అనుకున్నా ఫర్వాలేదు" అని మెట్లు దిగి వెళ్లిపోయింది పద్మావతి.

సత్యమూర్తి కళ్లు మూసుకుని పడుకున్నాడు. అతనికి నిద్ర పట్టడం లేదు. పద్మావతి వ్యక్తిత్వం అతన్ని అబ్బురపరుస్తోంది. ఎవరి స్వార్థం వారు, ఎవరి సుఖ సంతోషాలు వారు చూసుకుంటూ బతికేస్తున్న ఈ ప్రపంచంలో పద్మావతిలా ఆలోచించేవాళ్లు కూడా ఉంటారా? ఎంత విచిత్రం? తను



## తారల క్రేజ్

న్యూఇయర్ సెలబ్రేషన్స్ సందర్భంగా నిన్నమొన్నటి దాకా పెద్దగా డిమాండ్ చేయని తారలు సైతం ఈసారి తమ డాన్సుల కోసం భారీ మొత్తాలను డిమాండ్ చేస్తున్నారట. ఈమధ్య ఇలాగే ఓ హోటల్ వాళ్లు ఛార్మిని తమ న్యూఇయర్ ప్రోగ్రామ్‌లో డాన్స్ చేయమంటే- అలాగే తప్పకుండా అని ఆమె అనగానే ఉబ్బితబ్బిబ్బయిన హోటల్‌వాళ్లు ఆమె చెప్పిన పారితోషికం వినగానే ఠక్కున కళ్లు తేలేసారట. గంటకి 10 లక్షల చొప్పున ఇచ్చేట్టయితే డాన్సులు చేస్తానని ఛార్మి చెప్పిందిట.



జైలు గేటు నుంచి బయటకు అడుగు పెట్టినప్పుడు పద్మావతి ఎవరో గుర్తు లేదు. ఆమె తన మస్తిష్కం నుంచి ఎప్పుడో మాయమైంది. సాఫీగా సాగిపోతున్న జైలు జీవితం నుండి బయటడి ఎలా బతకాలా అనే ఆలోచనలో పడ్డాడు.

పద్మావతి అలా హఠాత్తుగా తనకు తారసపడి తన జీవితంలోకి ఆహ్వానించడం కేవలం అదృష్టమా? ఏమో? అతనికి గతం గుర్తుకువచ్చింది. తను జైలుకు వెళ్లడానికి కారణమైన సంఘటన జరిగిన రోజు.

సత్యమూర్తి డిగ్రీ పాసయ్యాడు. ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాడు. ప్రస్తుతానికి ఇక్కడ పని చేయి అంటూ అన్న ఒక టింబర్ డిపోలో పనికి కుదిర్చాడు. అక్కడికి దగ్గర్లోనే ఒక ఇంజనీరింగ్ కాలేజీ ఉంది.

ఈ రోజు సత్యమూర్తి సైకిల్ మీద వెళ్తున్నాడు. ఒక అమ్మాయి కేకలు వేస్తూ శక్తికొద్దీ పరుగెత్తుతోంది రోడ్డుమీద. ఆమె వెనుకాలే ఒక కుర్రాడు ఉన్మాదిలా చేతిలో యాసిడ్ సీసా పట్టుకుని ఆమె వెంట పడుతున్నాడు. తోటి విద్యార్థులు కానీ, రోడ్డున నడుస్తున్నవారుగానీ ఎవరూ అతన్ని వారించడానికి ప్రయత్నించడంలేదు. కొన్ని క్షణాల్లో అతను ఆమె ముఖం మీద యాసిడ్ పోస్తాడు.

అందమైన ఆమె ముఖం వికృతంగా మారిపోతుందనే ఆలోచన వచ్చేసరికి అతనికి అంతులేని ఆవేశం వచ్చింది. ఎదురుగా వస్తున్న అతనిమీద సైకిల్ ఎత్తి విసిరేసాడు. అంతే తను చేసింది. అతనికి ఎక్కడ దెబ్బ తగిలిందోగానీ కుప్పకూలిపోయాడు. మెడ నరికిన మేకలా గిలగిలా కొట్టుకున్నాడు. క్షణాల్లో అతని ప్రాణం పోయింది. తను నిశ్చేష్టుడై నిలబడిపోయాడు.

తర్వాత పోలీసులు వచ్చారు. తనను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లారు. తను జరిగింది చెప్పాడు.

ఒక అమ్మాయిని రక్షించడానికి తను యాదృచ్ఛికంగా అతన్ని అడ్డుకున్నాడు. కానీ తెలిసి చేసినా తెలియకచేసినా నేరం నేరమే అని న్యాయస్థానం తనకు జీవిత ఖైదు విధించింది.

***

సత్యమూర్తికి మెలకువ వచ్చింది. కళ్లు తెరిచి చూసాడు. సూర్యకిరణాలు ముఖం మీద పడుతున్నాయి. తను మెత్తటి పరుపుమీద పడుకుని ఉన్నాడు. పైన ఫ్యాన్ నెమ్మదిగా తిరుగుతోంది.

'ఇదేమిటి తను ఎక్కడున్నాడు? జైల్లోని బ్యారక్‌లో లేడా? తోటి ఖైదీలు ఎక్కడ? ఎవరూ కనిపించరేం? తను ఒక్కడే ఈ గదిలో ఉన్నాడెందుకు?'

ఎవరిదో అడుగుల చప్పుడు వినిపించింది. లేచి కూర్చున్నాడు.

"గుడ్‌మార్నింగ్" అంటూ గదిలోకి వచ్చింది పద్మావతి.

తలంటుకుని విరబోసుకున్న జుట్టుతో, లేత ఆకుపచ్చ చీరలో సీతాకోకచిలుకలా మనోహరంగా కనిపించింది పద్మావతి. ఆమెవైపే కళ్లార్పకుండా చూస్తున్నాడు.

ఆమె సిగ్గుతో తల వంచుకుని "బ్రష్ చేసుకురండి. కాఫీ తెస్తాను" అంది.

సత్యమూర్తి బాత్రూమ్‌లోకి వెళ్లి బ్రష్ చేసుకుని ముఖం కడుక్కుని వచ్చాడు. ఆమె కాఫీ కప్పు తెచ్చి ఇచ్చింది.

"నేను ఈ రోజు ఆఫీసుకు సెలవు పెట్టాను. మీరు త్వరగా రెడీ అయితే వెళ్దాం" అన్నదామె.

"ఎక్కడికి?" ఆశ్చర్యంతో అడిగాడు.

"మ్యారేజీ రిజిస్ట్రార్ ఆఫీసుకి" అంటూ ఆమె ముసిముసి నవ్వులు నవ్వింది.

అతనికి ఎందుకో చిలక జోస్యం గుర్తుకువచ్చింది. ఆ ముసలాయన చెప్పినట్లే తనను కోరుకున్న అమ్మాయితో వివాహం జరగబోతోంది. ఇక తను రాజభవనం కట్టడం, రత్నాల్లాంటి పిల్లలు పుట్టడం జరుగుతాయా? ఏమో? జరుగుతాయేమో!


అతనికి అదంతా తల్చుకుని నవ్వొచ్చింది.

"ఎందుకు నవ్వుతున్నారు?" అడిగింది పద్మావతి.

సత్యమూర్తి చిలకజోస్యం గురించి చెప్పాడు.

"మీరు చిలకజోస్యం కోసం అక్కడ పదినిముషాలు ఆగారు కాబట్టే నాకు తారసపడ్డారు. లేకపోతే మిస్సయిపోయేదాన్ని. చిలక జోస్యం అని తీసి పారేయకండి. ఏ చిలకలో ఏ మహత్యం ఉందో?" అంటూ పకపకా నవ్వింది పద్మావతి.

☆



## ఆర్కిటిక్ కరిగిపోతోంది

ఉత్తర ధృవం దగ్గర మంచు వేసవిలో కరిగిపోతూ శీతాకాలంలో గడ్డ కట్టడం అనాదిగా జరుగుతూనే వుంది. కానీ ఇటీవల వాతావరణంలోని ఉష్ణోగ్రత పెరిగి ఆర్కిటిక్ సముద్రంలోని మంచు శీతాకాలంలో కూడా వేగంగా కరిగి పోతోందిట. నాసావారి అంతరిక్ష నౌక అబ్జర్వర్ తీసిన ఫోటోల్నిబట్టి ఈ విపరీతాన్ని ధృవీకరిస్తున్నారు.

-తటవర్తి

